www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 డిసెంబర్ 2025
5
అన్నమయ్య

నిమ్మకాయలను ప్రభుత్వమే కొంటుంది : చైర్మన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిమ్మకాయల ధర అమాంతం పడిపోయిన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వమే నిమ్మకాయలను కొంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు. శనివారం ఆయన రైతు బజార్లో స్థానిక వినియోగదారులకు నేరుగా నిమ్మకాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరామ్ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. రైతుల నుంచి నేరుగా కిలో నిమ్మకాయలు రూ.20తో కొనుగోలుచేసి, రైతు బజార్లలో అదే రూ.20లకే వినియోగదారులకు విక్రయిస్తుందన్నారు. బజార్లో గిట్టుబాటు ధర లభించేవరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకుంటుందని స్పష్టం చేశారు.

నిమ్మకాయలను విక్రయిస్తున్న ఎఎంసి చైర్మన్

భయపెడుతున్న స్క్రబ్ టైఫస్

◆ జిల్లాలో 2 కేసులు నమోదు
◆ అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని రోజులుగా కలవర పెడుతున్న స్క్రబ్ టైఫస్ బ్యాక్టీరియా వల్ల జిల్లాలో కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ బ్యాక్టీరియా ఎక్కువగా పొలాలు, అపరిశుభ్ర ప్రాంతాలు, మురుగు నీరు నిల్వ ప్రాంతాల్లో వ్యక్తులను స్క్రబ్ బైఫస్ నల్లుల బారిన పడుతున్నారన్నారు. పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పొదలు, మొక్కల్లో ఎక్కువగా ఈ కీటకం కనబడుతుందని వైద్య అధికారులు చెబుతున్నారు. శరీరంపై ఈ బ్యాక్టీరియా కరిచినప్పుడు వాటి లాలాజలం ద్వారా బ్యాక్టీరియా మనిషిలోకి ప్రవేశించి తద్వారా మనిషికి వ్యాధి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 2 కేసులు నమోదు

జిల్లాలో ఇప్పటివరకు స్క్రబ్ టైఫస్ వ్యాధికి సంబంధించిన రెండు కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాలంలో కె.వి.పల్లి మండలం గర్నిమిట్టకు చెందిన ఒక్కరికి స్క్రబ్ టైఫస్ వ్యాధి రావడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. సంబేపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థికి స్క్రబ్ టైఫస్ ప్రబలినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఎస్‌సి వసతి గృహంలో ఉంటున్న అతడికి గత నెల 28న జ్వరం, దగ్గు లక్షణాలు కనిపించడంతో అక్కడే చికిత్స అందించారు. అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లారు. జ్వరం తగ్గక పోవడంతో ఈ నెల 9న తిరుపతి రుయా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు శనివారం వైద్యులు తెలిపారు. సంబేపల్లిలో విద్యార్థికి స్క్రబ్ టైఫస్ వ్యాధి నిర్ధారణ కావడంతో నియోజకవర్గంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళన అవసరం లేదు

జిల్లాలో ఇప్పటివరకు స్క్రబ్ టైఫస్ రెండు కేసుల నమోదు అయ్యాయి. వారికి మెరుగైన వైద్యం కూడా అందించాం. వారి ఆరోగ్యం కూడా నిలకడగా ఉంది. ప్రజలు పరిశుభ్రతను పాటించి, సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చు. జిల్లాలోని ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ లక్ష్మీ నరసయ్య, డిఎంహెచ్ఓ, రాయచోటి.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కరపత్రాల ఆవిష్కరణలో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను బిజెపి ప్రభుత్వం హరించి వేస్తుందని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ వర్కర్స్ నివాస ప్రాంతంలో సిఐటియు అఖిల భారత 18వ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వల్ల ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బిజెపి కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని, ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాట సాధించిన, 29 చట్టాలను, నాలుగు లేబర్ కోడులుగా, పెట్టుబడిదారులకు అనుకూలముగా మార్చారని చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, ఎనిమిది గంటల పనిని, 12 గంటలకు పెంచటం, రాష్ట్ర ప్రభుత్వం, ఎనిమిది గంటలను 10 గంటలకు పెంచడం, కనీస వేతనాలు జీతాలు పెంచాలని కార్మికులు, స్కీం వర్కర్లు కోరుతూ ఉంటే, పెంచకపోగా, కార్మికుల పని గంటలు పెంచడంతో, వేతనాలు తగ్గిపోయాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలుగా షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు సవరించలేదని, కార్మిక సంక్షేమ బోర్డుకు చైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదని, మరోపక్క పని గంటలు 8 గంటలను 10 గంటలకు పెంచటం, మహిళా కార్మికులతో పని చేయించుకునేవిధంగా మార్పు చేయటం, ఓవర్ టైమ్‌ను పెంచటం వంటి మార్పులను కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వం అనే అర్థం అవుతుందని విమర్శించారు. మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, అలాంటిది రాత్రిపూట పనులు చేయిస్తే మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో మరోసారి ప్రజనీకాన్ని నిలువు దోపిడీ చేయడానికి కార్మిక చట్టాలలో చేసిన మార్పులను తెస్తుందని వీటిని ప్రభుత్వాలు ఉపసంహరించుకునేంత వరకు, కార్మికవర్గం వీధి పోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. విన్‌ఫోసిస్ నారాయణ మూర్తి, ఎల్అర్‌టి సుబ్రమణ్యన్ కార్మికుల శ్రమను దోపిడీ చేసి లాభాలు గడిరచేందుకు మాట్లాడుతున్నారని విమర్శించారు. దానిని నిజం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్స్‌కు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందన్నారు. వెంటనే మార్పు చేసిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, పిఎఫ్, ఇఎస్ఐ గ్రాడ్యూటీ, నిర్వీర్యం అవుతుందన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి ఇప్పుడు పెట్టుబడిదారులకు అనుకూల విధనాలు అనుసరిస్తున్నారని, కార్మికులతో పెట్టుకున్న ప్రభుత్వాలేవి మనగడలో లేవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా నాయకులు రమణ, చెన్నయ్య, తిరుపతమ్మ, నాగార్జున, రాణి, సుజానా పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజీ మార్గమే రాచమార్గం : జిల్లా జడ్జి

పీలేరు : లోక్ అదాలత్‌లో 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్

ప్రజాశక్తి-పీలేరు

రాజీమార్గమే రాచమార్గమని భావించి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో రెండు చోట్లా రెండు వేరువేరు బెంచ్‌లను ఏర్పాటుచేసి లోక్ అదాలత్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ ఎడిజె కోర్టులో లోక్ అదాలత్ చైర్మన్, 11వ జిల్లా జడ్జి మహేష్ మోటర్ వాహన, బిఎస్ఎన్ఎల్, బ్యాంకు, సివిల్ కేసులను పరిష్కరించారు. రెండవ బెంచ్‌లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాల కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా 854 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ బెంచ్‌లలో ఎం.మధుసూదన్‌రెడ్డి, మునార్ బీ న్యాయవాదులుగా వ్యవహరించారు. కార్యక్రమాల్లో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, పోలీసు అధికారులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, కోర్టు కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు. **రాజంపేట:** రాజంపేట కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2087 కేసులు పరిష్కరించి కక్షిదారులకు రూ.58,67,880 పరిష్కారపత్రాలు అందించినట్లు 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటలో 3 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇన్ని కేసులు పరిష్కారం అయ్యేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని, న్యాయవాదులను, కోర్టు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాశ్, ఎపిపి టి.రామకృష్ణ, ఎజిపి మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.హనుమంత నాయుడు, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** రాజీ మార్గమే రాఎమార్గమని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ఫరూక్ అన్నారు. స్వానిక సివిల్ కోర్టులో న్యాయాధికారి ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ఇరువర్గాల కక్షిదారుల రాజీ మార్గం ద్వారా 860 కేసులను పరిష్కరించారు. ఇందులో అత్యధికంగా ఎస్‌టిసి(అడ్మిషన్) 819 కేసులు పరిష్కారమవ్వగా, ఒఎస్(ఎం)6, ఒఎస్(పీజె)2, ఒఎస్(పార్టేషన్)3, ఒఎస్(ఎస్సీ)1, ఒఎస్ (మార్టిగేజ్)1, ఇపి-5, ఎస్‌టిసి7, ఎంసి1, డివిసి1, సిసి(ఐపిసి)8, సిసి(అడ్మిషన్)5, పిఎల్‌పి (ఎపిఎస్ఆర్‌టిసి)1 కేసులు కలిపి మొత్తం 860 కేసులను పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల ద్వారా రూ.42,19,307నగదును రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజంపేట : లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్

జిల్లా కేంద్రానికి కట్టుబడి ఉన్నాం : 'చమర్తి'

మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట

అడ్డగోలుగా జిల్లాల విభజన చేసి పార్లమెంటు కేంద్రమైన రాజంపేటను జిల్లా కేంద్రం చేయకుండా అడ్డుకొని రాజంపేటకు తీవ్ర ద్రోహం చేసిన వైసిపి ఇప్పుడు చిలక పలుకులు పలుకుతోందని, ఒంటిమిట్ట, సిద్ధవటం, నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రజల ఆకాంక్ష మేరకు తాము ముందుకెళ్లడం జరుగుతుందని, రాజంపేట జిల్లా కేంద్రానికి తాను కట్టుబడి ఉన్నానని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు స్పష్టం చేశారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులే రాజంపేటకు పట్టిన దరిద్రమని, వైసిపి నాయకుల అహంకారం, పెత్తందారీతనం, స్వార్థ వైఖరి కారణంగానే రాజంపేట అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం విషయంలో గత వైసిపి ప్రభుత్వం అన్యాయం చేసిందని, ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీ తమ పదవులకు రాజీనామా చేసి గళం విప్పాలని సూచించారు. అంతేగాని మోసం చేసిన వైసిపిలోనే కొనసాగుతూ, అదే కండువాతో మళ్ళీ జిల్లా కేంద్రం కోసం మద్దతు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ఈ తెగువ అధికారంలో ఉన్నప్పుడు ప్రదర్శించి ఉంటే బాగుండేదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఉంటే తమకు అభ్యంతరం లేదని, లేనిపక్షంలో తమను కడప జిల్లాలోనే కొనసాగించాలన్న ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షను నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంత ప్రజల మనోవేదనను సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లి రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లాను సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కేంద్రానికి తాము కట్టుబడి ఉన్నామని, జెఎసి ఉద్యమాలకు తాను సంపూర్ణ మద్దతుగా నిలబడుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇదిమడకల కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి.వి.సుబ్బరాజు, ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.కరీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ రాజు, సొసైటీ డైరెక్టర్ పరుశురాం నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి- పీలేరు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ప్రశ్నావళి (క్విజ్) పోటీలు నిర్వహించారు. పీలేరు మండల స్థాయిలో శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పోటీలు నిర్వహించినట్లు ఎంఇఒ-2 బి.పద్మావతి తెలిపారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ప్రశ్నావళి (క్విజ్) పోటీలు నిర్వహించామన్నారు. వ్యాసరచనలో జరిగిన పోటీలో పీలేరు మండలం, శివరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.ఇర్ఫాన్, ఇఫా జమీన్ ప్రథమ, ద్వితీయ స్థానంలో సాధించారన్నారు. వక్తృత్వ పోటీలో ప్రథమ, అద్వితీయ స్థానాల్లో స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయ విద్యార్థినులు వి.లాస్యశ్రీ, లేఖన మీరు ఇచ్చారని చెప్పారు. ప్రశ్నావళి (క్విజ్) పోటీలో పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానంలోను, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయం విద్యార్థిని ద్వితీయ స్థానంలో విజయం సాధించారని తెలియజేశారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులు 14న ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా జిల్లా పరిషత్ మెయిన్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బాల మహేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు జలకనూరి మురళీధర్‌రాజు, నాగరాజ, అశోక్, మాధవి శ్వేత, ఉపాధ్యాయులు రెడ్డమ్మ, తస్లీమా, రమేష్ పాల్గొన్నారు.

'విధాత' ట్రైలర్ లాంచ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెకు చెందిన డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి ఎబిసి ప్రొడక్షన్ పతాకంపై నిర్మించిన విధాత సినిమా ట్రైలర్ శనివారం హైదరాబాద్‌లో ఘనంగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు మణికంఠ రాజేంద్రబాబు, నిర్మాత, హీరో భాస్కరాచారి మాట్లాడుతూ కొన్ని వాస్తవ ఘటనల నేపథ్యంలో ఈ సినిమాను నిర్మించామన్నారు. కథా కథనాలు, విభిన పాత్రలతో చిత్రం ఎంతో సహజంగా ఉంటూ ఆకట్టుకుంటుందన్నారు. ప్రేక్షకుల్లో స్ఫూర్తిని నింపేలా విధాత సినిమా ఉంటుందని, త్వరలోనే సినిమాను థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, ఇతర నటీనటులు, మూవీ టీమ్ మెంబర్స్ పాల్గొన్నారు. ఈ చిత్రంలో నటీనటులుగా భాస్కరాచారి, కోటేశ్వరరావు, సుమ రాఘవేందర్‌రెడ్డి, చిన్ని, దినకర్, అప్పలబట్ల సురేష్, ఉదయ్ కుమార్ తదితరులు ఉండగా టెక్నికల్ టీమ్ సంగీతం డ్రమ్స్ రాము, డాన్స్ బాలు, సింగర్స్ సింధుజ శ్రీనివాసన్, నందకిషోర్, నిర్మాత అప్పినపల్లె భాస్కరాచారి, దర్శకత్వం మణికంఠ రాజేంద్ర బాబు, పిఆర్ఓ వీరబాబు చేశారు.

రేపు వైసిపి భారీ ర్యాలీ

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ఈ నెల 15న రాయచోటి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదలకు అందుబాటులో ఉన్న వైద్య విద్యను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడాన్నీ నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం అన్ని ప్రాంతాల్లో విజయవంతమైందని అన్నారు. సంతకాల ప్రతులను జిల్లా కేంద్రమైన రాయచోటి నుండి తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాల యానికి తరలించనున్న సందర్భంగా రాయచోటిలో భారీ ర్యాలీనీ నిర్వహిస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

డిఎంహెచ్‌ఒకు సన్మానం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మి నరసయ్యను శనివారం ఎన్‌జిఒ సంఘం జిల్లా నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. అన్నమయ్య జిల్లా ఎపి ఎన్‌జిఒ సంఘానికి నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు ఎం. వేణుగోపాలరెడ్డి, కార్యదర్శి శ్రీ నివాసన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, అన్నమయ్య జిల్లా నాయకులు శివారెడ్డి, నాగేశ్వర్ రావు,మహాదేవ, నరసింహ దేవేంద్ర, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు బలరామ రాజు డిఎంహెచ్‌ఒకు శాలువ కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ కార్యాలయ సిబ్బంది, సిహెచ్‌ఒ నారాయణ, సుధాకర్, సుజిత్, ఈశ్వరయ్య, ఓబుళరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో నవోదయ 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా నవోదయ ప్రవేశ పరీక్షకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమరాణి చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఈ పరీక్ష కేంద్రానికి డిపార్ట్మెంటల్ ఆఫీసరుగా వ్యవహరించిన మండల విద్యాశాఖ అధికారి-2 బి.పద్మావతి మాట్లాడుతూ నవోదయ 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 230 మంది విద్యార్థులకుగాను 209 మంది విద్యార్థులు హాజరయ్యారని, మరో 21 నంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు గైర్హాజరు అయ్యారని చెప్పారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించడం జరిగిందన్నారు. మదనపల్లి వలసపల్లి నవోదయ పాఠశాల ఉపాధ్యాయిని బిందు పరీక్ష కేంద్రం పరిశీలకు రాలుగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమ రాణి చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

దూదేకుల శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నూర్‌బాషా దూదేకుల శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూర్‌బాషా దూదేకుల సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మదనపల్లె జిల్లాను సాధించడానికి నిర్విరామ కృషి చేసిన ఎమ్మెల్యేకి మదనపల్లి జిల్లా సాధన కీర్తి దక్కుతుందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం, నియోజకవర్గం అభివృద్ధి, మైనార్టీల హక్కుల పరిరక్షణకు అలుపెరుగని కృషి చేస్తున్నారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, ఆర్టీసీ 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి మాట్లాడుతూ నిస్వార్థమైన ప్రజా సేవకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో మదనపల్లె పట్టణంలో నూర్‌బాషా దూదేకులకు ఒక కమ్యూనిటీ హాల్, షాదీమహల్ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తగినన్ని ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, కౌన్సిలర్, సర్పంచ్ సీట్లు కేటాయించాలని కోరారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటుకి అనుమతి ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాల కేటాయించాలని, విద్యాపరమైన సీట్ల కేటాయింపులో రిజర్వేషన్ అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించించిన దూదేకులకు అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ ప్రాంత అధ్యక్షులు ఇందాతుళ్లా, చిత్తూరు జిల్లా అధ్యక్షులు షఫీ సాహెబ్, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్, ముజీబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

లక్ష్మీప్రసాద్‌రెడ్డిని కలిసిన సుబ్బరాజు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : సంబేపల్లి దేవరరాయ నల్లగంగమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కునాసి సుబ్బరాజు యాదవ్ శనివారం టిడిపి యువ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, నిశ్చల్ నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిశారు. శాలువా కప్పి పుష్ప గుజ్జు అందజేసి ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో సంబేపల్లి టిడిపి నేతలు గోవర్ధన్ రెడ్డి, బాలకొండరెడ్డి, నంద యాదవ్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్తీ మద్యం కేసులో కస్టడీకి ఇద్దరు నిందితులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మొలకలచెరువు కల్తీ మద్యం కేసులో శనివారం ఎక్సైజ్ పోలీసులు ఇద్దరు నిందితులను కస్టడీకి తీసుకున్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ములకలచెరువు కేంద్రంగా నడుస్తున్న కల్తీ మద్యం తయారీ స్థావరాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో పలువురు రాజకీయ నాయకులు ప్రమేయం ఉండడంతో అరెస్టయ్యారు. ఈ కేసులో ఎ24, ఎ25 నిందితులు కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లాకు చెందిన జీనెస్, శిబు మదనపల్లె సబ్ జైలులో ఉన్నారు. ఆ ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు.

ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్న నిందితులు

మాట్లాడుతున్న ఎస్ఇ సత్యరాజ్ కుమార్

అంతరాయాల్లేని విద్యుత్తు సరఫరా లక్ష్యం : ఎస్ఇ

ప్రజాశక్తి-రాజంపేట : అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును అందించడమే తమ లక్ష్యమని విద్యుత్ ఎస్ఇ ఎం.సత్యరాజ్ కుమార్ తెలిపారు. విద్యుత్ ఇఇ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు గాను 220 కెవి బ్రాహ్మణపల్లె సబ్ స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. మూడు ఆధునికీకరణ పనులు చేపట్టామని తెలిపారు. 220 కెవి సింగిల్ జిబ్రాబజ్‌ను ట్విన్ మౌజ్ బజ్‌గా ఆధునికీకరిస్తున్నామన్నారు. సి.కె.పల్లి-రేణిగుంట 220 కెవి వనరునులిలో చేసి రూపాంతరం చేస్తున్నామన్నారు. ఆకేపాడు, వత్తలూరులో 33 కెవి ఫీడర్లు నూతనంగా ఏర్పాటు చేశామని చెప్పారు. రాజంపేట, పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు దోహదపడునున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఇ సి.హెచ్.శ్రీరామచంద్రమూర్తి, ఇఇలు వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, చంద్రశేఖర్, డిఇఇలు అచ్యుత్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, గోవింద్, ఎఇఇలు దినేష్ కుమార్, సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యులను, వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నిమ్మనపల్లి మండలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై కొందరు వైసిపి నాయకులు దాడి చేశారని తెలియగానే కార్యకర్తను పరామర్శించి పోలీస్ శాఖతో మాట్లాడి తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఇది వైసిపి ప్రభుత్వం కాదని, కూటమి ప్రభుత్వమనే విషయాన్ని గుర్తు పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.రెడ్డి షంషీర్, బీదం గురునాథ్ యాదవ్, పెంచుపాడు స్వామి, బాలమాలి శేఖర్, రెడ్డి రాయల్, నయాజ్, చల్లా చలపతి పాల్గొన్నారు.

ఎమర్జన్సీలో ఒపి రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వైసిపి కార్యకర్తను పరామర్శిస్తున్న ఖలీల్ అహ్మద్

వైసిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని మొటుకు పంచాయతీ, చిన్నపల్లిలో నివాస ముండే వైసిపి కార్యకర్త హరినాథ్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మాజీ ఎంపిపి ఖలీల్‌అహ్మద్, హరినాథ్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.ఈ సంద ర్భంగా ఖలీల్ మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తల శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో తాము సైతం నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. హరినాథ్‌రెడ్డి త్వరగా కోలుకోవాల ని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రామసుబ్బారెడ్డి, రాయల్ సలీం, గట్ల మీద నరసింహనాయుడు, పి.నరసింహారెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప చెట్లను తొలగిస్తున్న జెసిబి

సంత గేటులో కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లి సంత గేటు ప్రాంతంలో కంప చెట్లు పెరిగి పందులకు ఆవాసాలుగా మారడంతో స్థానిక ప్రజలు టిడిపి మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్‌నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహేష్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు వారి సొంత నిధులతో జెసిబిని ఏర్పాటు చేయించి కంపచెట్ల తొలగింపజేసి గేటు ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. మండలంలోని శ్మశానాలు, పైపులైన్లు, మంచినీటి సమస్య, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. మండలంలో14 గ్రామాలలో ప్రజలను సమస్యలను తెలుసుకోవడానికి గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి వారి ద్వారా సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపుతామన్నారు.కార్యక్రమంలో ఓబులేసు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ త్యాగరాజు తెలిపారు. ఇంగ్లీష్ మీడియం 113మంది విద్యార్థులకు గాను 97 హాజరు కాగా 16 మంది గైరహాజరైనట్లు తెలిపారు. తెలుగు మీడియంలో 58 మందికి గాను 39 పరీక్ష రాయగా 19 మంది గైరహాజరయ్యారు. ఉర్దూ మీడియంలో నలుగురు పరీక్షలు రాసినట్లు తెలిపారు.175 మంది విద్యార్థులకు గాను 140 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. చీఫ్ సూపర్ ఏంటెండ్ హెచ్‌ఎం శ్రీని వాస్, సిఎల్ఒ శిబా ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ చాణిక్య పర్యవేక్షించారు.

'మిట్స్' ప్రొఫెసర్ రామ్‌ప్రియకు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బియూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆర్.రామ్ ప్రియాకు తమిళనాడు రాష్ట్రంలోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసినట్లు మిట్స్ డీమ్డ్ టు బియూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. అన్నామలై యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి పిహెచ్‌డి డిగ్రీ పొందిన ఆమె, అక్కడి అసోసియేట్ ప్రొఫెసర్, రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ ఎన్. సుగుణ పర్యవేక్షణలో 'ఐడెంటిఫికేషన్ ఆఫ్ పుల్మనరీ డిసార్డర్ యూజింగ్ ఆప్టిమైజ్డ్ డీప్ లెర్నింగ్ మోడల్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆర్.రామ్‌ప్రియాను మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రోఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పనా, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి తెలిపారు. అధికలోడ్‌తో వెళుతున్న ఆటోలను శనివారం ఆయన పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రైవింగ్‌లో యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పక కలిగి ఉండాలన్నారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఉంచి, ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మోటర్ వాహనాల చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి ఆటోలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు గ్రామ స్థాయి నుంచి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి పటిష్టతకు గ్రామస్థాయి నుంచి సభ్యులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎస్.రఘురామిరెడ్డి కోరారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవళాలులో శనివారం ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ, సబ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో కమిటీ సభ్యులకు పార్టీ ఐడి కార్డు ఇస్తామన్నారు. వైసిపిలో కోవర్టులకు స్థానం లేదన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. కమి టీల్లో ఇతర పార్టీల వారికి స్థానం లేదన్నారు. ఈనెల 15న జిల్లా కేంద్రంలో ర్యాలీ ఉంటుందని, ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన పిలుపు ని చ్చారు. ఈనెల 21న జగన్ జన్మదినం సందర్భంగా ప్రతి గ్రామంలో రచ్చ బండ వద్ద సమావేశాలు జరపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షు మ య్య, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్ర టరీ రవిశంకర్‌రెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా కక్షిదారురాలు అయిన ఏరువాక పావని W/o బెండు రాజేంద్ర నాయుడు, పార్థసారధి వీధి, కొత్తపేట, రాయచోటి టౌన్ మరియు మండలం అను వారు 22.11.2025వ తేదీన రాయచోటి ఆర్టీసీ బస్టాండుకు వెళ్తూ తనయొక్క లింకు రిజిస్టర్డ్ దస్తావేజు నెం.2902/1987 తేదీ 27.05.1987గా గల దస్తావేజును పోగొట్టుకున్నారు. కావునా సదరు దస్తావేజు ఎవ్వరికైనా దొరికి ఉన్న యెడల నాకు గానీ నా కక్షిదారులుకు గానీ చేర్చవలసిందిగా ప్రార్థన.

కె. నాగమల్లు
అడ్వకేట్,
రాయచోటి.
సెల్: 9985856226.

హార్సిలీహిల్స్‌లో లోపించిన పారిశుధ్యం

- దర్శమిస్తున్న మద్యం బాటిళ్లు, చెత్తాచెదారం
- పట్టని పర్యాటక శాఖ అధికారులు

హార్సిలీహిల్స్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రముఖ పర్యాటక కేంద్రం.. వేసవి విడిదిగా పేరుగాంచిన హార్సిలీహిల్స్ ప్రక ృతి అందాలకు నెలవు. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఎక్కడ చూసినా చెత్తాచెదారం, పగిలిన గాజు సీసాలు, మందు బాటిళ్లతో దర్శనం ఇవ్వడంతో పర్యాటకుల సైతం అస హనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రయివేట్ అతిథి గృహాల నుంచి పెద్దఎత్తున మురు గునీరు గాలి బండపై ప్రవహిస్తుండడం, మురుగునీరంతా నీటి కొలనులా ఏర్పడడం, దుర్వాసన వెదజల్లుతోంది. గాలిబండ వద్ద సూర్యాస్తమయం సమయంలో పర్యాటకులు అధిక సంఖ్యలో వీక్షించడానికి వస్తుంటారు. ఈ పగిలిన గాజు సీసాలు, దుర్వాసన, చెత్తాచెదారం ఉండటంతో పర్యాటకులు విముఖత చూపుతున్నారు. ప్రకృతి ప్రేమికులకు వీటి వల్ల తీరని లోటు మిగులుతోంది. ఘాట్ రోడ్డుపై ప్రయాణాలు చేస్తున్న వాహన దారులకు అక్కడక్కడ కంకర తేలిన రోడ్లు, శిథిలావస్థకు చేరిన పిట్టగోడలు, కనిపించని సూచిక బోర్డులు ఇటీవల జరిగిన ప్రమాదాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని పర్యాటకు పేర్కొంటున్నారు. ఒబెరాయ్ ఏడు నక్షత్రాల హోటళ్లకు ప్రభుత్వం భూకేటాయింపు దిశగా అడుగులు వేయడంతో యుద్ధ ప్రాతిపదికన భూకేటాయింపు దిశగా బిజీగా అధికారులు, మధ్యతరగతి చిన్న తరహా ప్రకృతి ప్రేమికులకు సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు మొగ్గు చూపడం లేదని పర్యాటకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గాలిబండపై పేరుకు పోయిన మురుగు, దర్శన మిస్తున్న మద్యం బాటిళ్లు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి కషాయాన్ని తయారు చేస్తున్న రాజశేఖర్‌రాజు

ప్రజాశక్తి-వీరబల్లి

మామిడి తోటల రైతులు పకృతి వ్యవసాయంతో మంచి లాభాలు పొందవచ్చని ఎఫ్ఆర్‌డిఎస్ చైర్మన్ రాజశేఖర్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో తన మామిడి తోటలో నిమ్మకాయలు, కోడిగుడ్లు, బెల్లం కలిపి ద్రావణాన్ని తయారు చేసే పద్ధతిని రైతులకు చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పకృతి వ్యవసాయం ఆవశ్యకత, వ్యవ సాయ విధి విధానాలు పకృతి విశిష్టత గురించి వివరించారు. భూ సమ తుల్యత వైవిధ్యం కాపాడుకోవడం ప్రజలందరి సమష్టి బాధ్యతని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం మామిడి రైతులకు లాభదాయకం, ఎందుకంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుంది, మంచి నాణ్యతతో కూడిన పంట వస్తుందన్నారు. క్రిమీసంహారక రసాయనక ఎరువులు వాడడం వలన మామిడి కాయలు పండించిన రైతులకు ఎగుమతులకు అనుకూలంగా లేదు. ఏప్రిల్, మే, నెలలో మామిడి కాయలకు రేట్లు ఉన్నప్పటికీ జూన్, జూలైలో రేట్లు భారీగా పతనమై మామిడి రైతులు నష్టాలు పాలవతున్నారన్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి, లాభాలు రావాలంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. భవిష్యత్తు తరాలు రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలంటే పకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమన్నారు. మామిడి రైతులు మామిడి చెట్లకు పశువుల ఎరువు, కోళ్ల పెంట, పచ్చి రొట్టె ఎరువులు వేసి, ద్రావణం పిచికారి చేసి నట్లయితే మంచి దిగుబడి వస్తుందన్నారు. వీరబల్లి మండలం అంత ర్జాతీయ పరంగా మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంది. మామిడిలో ఫ్రూట్ కవర్ విధానం సత్ఫలితాలు ఇస్తుందన్నారు. దీనివల్ల రైతులకు మంచి ఆదాయం వస్తుంది మార్కెట్లో మంచి ధర లభిస్తుంది, ముఖ్యం గా ఫ్రూట్ కవర్ విధానం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. మంచి నాణ్యత, దిగుబడి వల్ల రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుంది. రైతులందరూ పకృతి కషాయాలు తయారు చేసుకుని సేంద్రియ పద్దతిలో వ్యవసాయం చేయాలని కోరారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లి సమీపంలోని కొండమర్రిపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ఆరవ రోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు గ్రామ ప్రజలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో విద్యార్థులు చెట్లు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. చెట్లు మన జీవితానికి ఎంత అవసరమో, వాటిని ఎలా సంరక్షించుకోవాలో గ్రామస్తులకు వివరించి చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. దేవేంద్ర నాయక్, ఫిజికల్ డైరెక్టర్ శరత్ కుమార్ పాల్గొని విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.

మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

యుటిఎఫ్ పట్టణ కమిటీ ఏకగ్రీవం

నూతన ఎన్నికైన సభ్యులు హాసన్‌బాషా గజేంద్ర, పయని

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్ :

మదనపల్లె పట్టణ యుటిఎఫ్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, డివిజన్ కన్వీనర్ ఎగవింటి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వ హించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సం దర్భం గా పట్టణ అధ్యక్షులుగా హాసన్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా గజేంద్ర, ట్రెజరర్‌గా టి.పయని ఎంపికయ్యారు. మహిళా కన్వీనర్‌గా సుమల నియ మితులయ్యారు. గౌరవ సలహాదారులుగా గంపల శీనప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా బెల్లం సుధాకర్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా పుత్తూరు సుబ్రమణ్యం, ఉదయ్ కుమార్, అంజప్ప కుమార్, బాబు, రామాం జనేయులు ఎంపికయ్యారు. కార్యదర్శులుగా ప్రసాద్, శ్రీనివాసులు, జిలానిబాషా, కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా వెంకటరమణ, సుధాకర్, ముని రాజా, భానుమూర్తి ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన నాయకులు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు అంకిత భావంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జిల్లాగౌరవాధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా అధ్యక్షురాలు హేమలత, జిల్లాకార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

మంచు మయం.. దారి మాయం

- పల్లెలను కప్పేస్తున్న మంచు దుప్పటి
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- నెమ్మదిగా వెళుతున్న వాహన చోదకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పల్లెలను కప్పేస్తున్న పొగమంచు చాలా ఆహ్లాదంగా ఉంటుంది. పొలాలు, రోడ్లు, ఇళ్లపై మంచు దుప్పటిలా పరుచుకుంటుంది. ఈ వాతావరణాన్ని చూడడానికి చాలా మంది ఇష్టపడతారు. అయితే ఇదే పొగమంచు వల్ల అనర్థాలు కూడా కలుగుతాయి. ముఖ్యంగా దారి కనబడక వాహన ప్రమాదాలు జరుగుతాయి. అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ఇటీవలి కాలం నుంచి చలి తీవ్రమైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా చల్లబడిపోవడంతో ప్రజలు చలికి వణికి పోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 8 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది చలి ఎక్కువగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి అంతగా చలి కనిపించలేదని పలువురు చెబుతున్నారు. రాబోవు రోజుల్లో ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ చెబుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చలి నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ వాతావరణ శాఖ సూచిస్తోంది.

దట్టంగా పొగ మంచు..

అర్ధరాత్రి ఒంటిగంట దాటినప్పటి నుంచి తెల్లవారుజాము వరకు పొగ మంచు దట్టంగా అలుముకుంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పొగ మంచు ఎక్కువగా కనిపిస్తుంది. జాతీయ రహదారుల వెంబడి వెళ్లే వాహనాలకు పొగ మంచు ఆటంకం కల్పిస్తుంది. వివిధ పనుల నిమిత్తం వెళ్లే గ్రామీణ రైతులు, వ్యవసాయ కార్మికులు, వ్యాపారాల కోసం వెళుతున్న చిరు వ్యాపారులకు పొగ మంచు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ప్రయాణాలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్లపై ప్రయాణించే పెద్ద వాహనాలకు పది మీటర్లు మించి దారి కనపడని పరిస్థితి. పలువురు పొగ మంచు తగ్గేవరకు వాహనాలను రోడ్ల పక్కన పార్కింగ్ చేస్తున్నారు. తెల్లవారుజామునే పొట్టకూటి కోసం పనులకు వెళ్లే భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు ఇతరులు మంచు దెబ్బతో అవస్థలు పడుతున్నారు. జిల్లాలో పలుచోట్ల వరి పంట చివరి దశలో ఉంటూ కోతకు వస్తుంది. ఈ నేపథ్యంలో మంచు దెబ్బతో యంత్రాల ద్వారా కోతలు పలుచోట్ల జోరుగా చేపడుతున్నారు. తెగుళ్ల దాడి ఎక్కువగా ఉంటుందని పలువురు రైతులు వాపోతున్నారు. తేమ శాతాన్ని తగ్గించేందుకు రైతులు రోడ్లకిరువైపులా ధాన్యాన్ని అరబోస్తున్నారు. మంచు దెబ్బ వల్ల తేమ శాతం తగ్గేందుకు అదనంగా ఒకటి నుంచి రెండు రోజులు సమయం పడు తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెల్లవారుజామున కమ్మేసిన పొగ మంచు

రగ్గులు, స్వెటర్లకు గిరాకీ..

చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ రగ్గులు, స్వెటర్లకు గిరాకీ పెరిగింది. చలి నుంచి రక్షణ పొందేందుకు పలువురు వీటిని వినియోగిస్తున్నారు. ఉన్ని దుస్తులు కావడంతో వెచ్చదనం వస్తుందన్న కారణంతో వీటిని ఉపయోగిస్తున్నారు. ఆయా వ్యాపారస్తులు అన్ని ప్రాంతాల్లోనూ తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు మొదలు పెట్టారు.

అనారోగ్యాలతో ఆసుపత్రులకు..

చలి తీవ్రత పెరగడంతో పలువురు అనారోగ్యాల గురువుతున్నారు. వైరల్ ఫీవర్లతో సతమతమవుతున్నారు. జలుబు, దగ్గు ఇతర ఇన్‌ఫెక్షన్‌లతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదునుగా పలు ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. రక్త పరీక్షలు, మందులు, ఒపి ఫీజుల పేరుతో పెద్ద మొత్తంలో గుంజుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి వ్యాధుల కాలంలో ప్రయివేటు ఆసుపత్రులపై నిఘా పెట్టి పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి సభ్యులు

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాజంపేటలో జిల్లా కేంద్రం చేయాలంటూ రైల్వే కోడూరు ఈ జెఎసి అధ్య క్షులు ముత్యాల పెంచలయ్య అధ్యక్షతన ప్రయివేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. రాజంపేట జిల్లా సాధన సమితి ఉద్యమ కార్యచరన గురించి చేర్చించటానికి సాయి డిగ్రీ కాలేజీలో ప్రయివేట్ స్కూల్స్, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ కరెస్పాండంట్స్ అసోసియేషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య మాట్లాడుతూ రాజంపేట జిల్లా కేంద్రం కోసం జెఎసి తరపున రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఒక భారీ ర్యాలీతో పాటు నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ పోరాటం విరామం లేకుండా కొనసాగిస్తామన్నారు. తదుపరి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని కమిటీ సభ్యులు తీర్మానించారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ర్యాలీ

నందలూరు : అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని మండల కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు, ఆ పాఠశాల కరస్పాండెంట్ భూమన శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలతో ఉన్న అన్నమయ్య జిల్లాకు రాజంపేట మధ్యస్థంగా ఉంటుందని రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు. అటు బద్వేల్‌కు ఇటు కోడూరుకి మధ్యలో ఉన్నందువల్ల పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. దీంతోపాటు రైలు మార్గం ద్వారా కృష్ణపట్నం, మద్రాసు ఓడరేవులకు కనెక్టివిటీ ఉంది. జాతీయ రహదారి, ఎన్నో మౌలిక వసతుల తోపాటు రేణిగుంట, కడప రెండు విమానాశ్రయాలకు దగ్గరగా ఉంటుందన్నారు. ఎన్నో సదుపాయాలు ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు లోక్మాన్ సింగ్, శ్రీనివాసులు, సౌరి, విద్యార్థులు పాల్గొన్నారు.

జయరామిరెడ్డిని పరామర్శించిన బీటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక టిడిపి జిల్లా కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డిని శనివారం పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పరా మర్శించారు. జయరామిరెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో కర్నూలు ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొంది వేంపల్లెకు వచ్చారు. విషయం తెలుసు కున్న బీటెక్ రవి, పార్టీ మండల పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ ఎస్.రామమునిరెడ్డి, సీనియర్ నాయకులు షబ్బీర్ ఆయనను పరా మర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. త్వరగా కోలుకొని పార్టీకి తమ విలువైన సేవలు, సూచనలు అందించాలని వారు జయ రామిరెడ్డిని కోరారు. జయరామిరెడ్డి కుమారుడు శివకృష్ణారెడ్డితో పలు విష యాలపై చర్చించారు. కార్యక్రమంలో టిడిపిపట్టణ అధ్యక్షులు వేమకుమార్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు యాసిన్, టిడిపి నేతలు దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి, మారుతి, వార్డు సభ్యులు కంతూరి వెంకటేష్, కమటం హరికుమార్‌రెడ్డి, అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని కూటమి నాయకులిచ్చిన హామీని పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుండి అంగన్వాడీ హెల్పర్ల, వర్కర్ల వేతనాలు పెంచలేదన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలని కోరారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చొరవ చూపడంలేదన్నారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మోడీ ప్రభుత్వం బీమా రంగాన్ని హోల్‌సేల్‌గా ప్రైవేట్ రంగానికి అమ్మేసిందని ఆరోపించారు. ఇప్పటివరకు బీమా రంగంలో 74 శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అనుమతి ఉండేదన్నారు. దాన్ని 100 శాతానికి పెంచుతూ ఇటీవల కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రజల జీవితకాలపు పొదుపు సంక్షోభంలో పడుతుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ముప్పు అన్నారు. ఈ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

సిమెంట్ బెంచీలు వితరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

మండలంలోని గురజాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పప్పుగారి రాములు రూ.55 వేలు విలువచేసే సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. శనివారం గ్రామంలోని గురుకుంట కల్యాణ మండపంతోపాటు గ్రామంలో 12 బెంచీలను పప్పుగారి రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమానికి రిటైర్డ్ టీచర్ రాములు ముందుకు రావడం ఎంతో అభినం దనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యార్థిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఇంటర్ విద్యార్థిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్ర కలకలం రేపుతున్న ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం చంద్రమాకుల పల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన రాజబాబు, కళావతి దంపతుల కుమారుడు నాయుని రెడ్డిప్రసాద్ మదనపల్లెలోఓ ప్రయివేట్ కాలేజీలో ఇంటర్ చదువు తున్నాడు. ఈ క్రమంలో స్థానిక కోమటివాని చెరువువద్ద రెడ్డిప్రసాద్‌ను కొందరు గుర్తు తెలియని యువకులు చుట్టుముట్టి కాళ్లు చేతులతో తన్ని, బెల్టుతో గొంతు బిగించి చంపేందుకు ప్రయత్నించారు. దెబ్బలకు స్పృహ కోల్పోవడంతో చనిపోయాడని భావించి పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న విద్యార్థిని గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై రెండవ పట్టణ పోలీసులు మరిన్ని వివరాలను వెల్లడించాల్సి ఉంది.